క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



తాడూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బి శ్రీనివాసులు రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆదివారం నిర్వాహకులు చంద్రయ్య, రాములు కోరగా ఆయన వెంటనే స్పందించి తనవంతుగా నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నిరంజన్, రాములు, రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట



కల్వకుర్తిరూరల్: దీపావళి పండుగకు సొంత గ్రామాలకు వచ్చిన ప్రజలు రెండు రోజుల పాటు పండుగ వేడుకలను నిర్వహించుకున్నారు. ఆదివారం కావడంతో తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. బస్టాండ్‌కు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు తరలిరావడంతో రద్దీగా కనిపించింది. ఉదయం నుంచి హైదరాబాద్‌కు బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. చాలామంది సీట్లు లేకున్నా పోటీపడి ఎక్కారు.

ఘనంగా కార్తీక పూజలు

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం కమిటీ, రుక్మిణి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక పూజలు(ఆకు పూజలు) భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భక్తిగీతాలను ఆలపిస్తూ భక్తి పారవశ్యంలో మునిగారు. తీర్థప్రసాదాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పులిజాల శేఖర్, సురేష్, నర్సింహ, శ్రీనివాసులు, చంద్రమౌళి, బాలయ్య, మహిళలు సంబు శోభ, దీపిక, జయమ్మ, ప్రభావతమ్మ, సరస్వతి, పద్మజ పాల్గొన్నారు.

ప్లీనరీకి తరలిన డీఎస్పీ నాయకులు



చారకొండ: ధర్మ సమాజ్ పార్టీ మహాసమ్మేళనానికి ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల నాయకులు ఆదిభట్లలో నిర్వహించిన పార్టీ ప్లీనరీ సమావేశానికి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మహరాజ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బహుజనుల రాజకీయంగా రాణించాలన్నారు. రాధాకృష్ణ, విజయ్, నాయకులు వెంకటేష్, నాగార్జున, మల్లేష్, అంజయ్య, మొగులయ్య, కిరణ్, మహేష్, రామకృష్ణ, పరశురాములు ఉన్నారు.

అధ్యక్షుడిని కలిసిన వికలాంగులు



నాగర్‌కర్నూల్‌రూరల్: హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు రాజేందర్‌ను జిల్లాలోని వికలాంగులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, మల్లికార్జున్, యాదగిరి, గంటా తిరుపతిరెడ్డి, రాజేశ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల బెడద

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వీధికుక్కలు రోజురోజుకు పదుల సంఖ్యలో పెరిగిపోతున్నాయి. కాలనీలలో వీధికుక్కల బెడద అధికమైంది. కాలనీవాసులు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కుక్కలు గుంపులు సంచరించడంతో చిన్నారులు భయాందోళకు గురవతున్నారు. ఇటీవల పలు గ్రామాల్లో మేకపిల్లలను, గొర్రెపిల్లలను చంపివేశాయి. అధికారులు స్పందించి వీధికుక్కలను అటవీప్రాంతాలకు తరలించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సబ్‌స్టేషన్‌కు మోక్షమెప్పుడో?

- అసంపూర్తిగా పనులు
- రైతులకు తప్పని ఇబ్బందులు



పోతేపల్లిలో అసంపూర్తిగా సబ్‌స్టేషన్

వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు గత ప్రభుత్వం 2018లో 33/11కేవీఏ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణానికి అప్పట్లో రూ.1.20కోట్ల నిధులను మంజూరు చేసింది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి కాంట్రాక్టర్లు టెండర్ ద్వారా పనులు దక్కించుకుని పనులను ప్రారంభించారు. కొంత వరకు పనులు ప్రారంభం చేసిన కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా పనులను నిలిపివేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్, సబ్‌కాంట్రాక్టర్‌కు ఇద్దరి మధ్య బిల్లుల సమస్యలు వచ్చి పనులు మధ్యలో నిలిపివేయడంతో సమస్య మొదటికి వచ్చింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, దొడ్లపల్లి, మహాత్మాగాంధీతండా, అల్లంతోటబావితండా, సిలోనిబావితండా, పోషమ్మతండా తదితర గ్రామాల రైతులు విద్యుత్ కష్టాలు తీరిపోతాయని భావించారు. కాని రైతుల ఆశ మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. పనులు నిలిచి దాదాపుగా 6 ఏళ్ల గడిచిన నేటికి పూర్తి కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు అనేక సార్లు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని రైతులు వాపోయారు.

మూడు ఫీడర్లుగా ఏర్పాటు

గ్రామానికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని అన్నదాతలు సంతోషపడ్డారు. గ్రామంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని దాదాపుగా రూ.5వేల వ్యవసాయ కనెక్షన్‌లు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. వాటికి అనుగుణంగానే విద్యుత్ అధికారులు కూడ సబ్‌స్టేషన్ నుంచి మూడు ఫీడర్లు విభజన చేసి రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశారు. పోతేపల్లి ఫీడర్ కింద 3 వేల వ్యవసాయ కనెక్షన్లుగా విభజించి అల్లంతోటబావితండా, పోషమ్మతండా, పోతేపల్లి ఏర్పాటు చేశారు. అదే విధంగా లింగారెడ్డిపల్లి ఫీడర్‌కింద 2 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లుగా ఎంపిక చేసి దొడ్లపల్లి, జేపల్లి, దొంగల గట్టు తండా, లింగారెడ్డిపల్లిగా ఏర్పాటు చేశారు. అదే విధంగా పోతేపల్లి గ్రామానికి వ్యవసాయ విద్యుత్‌తో సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఫీడర్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు.

లోఓల్టేజీ సమస్యతో..

కల్వకుర్తి ఎత్తిపోథల పథకంలో భాగంగా డి–82 కాల్వ ద్వారా సాగునీరు వస్తుంది. దీంతో రైతులు పంటలను అధిక సంఖ్యలో సాగుచేశారు. విద్యుత్ వినియోగం అధికం కావడంతో తరుచుగా లోఓల్టేజీతో వ్యవసాయ మోటర్లు మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి పనులను పూర్తిచేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మోటర్లు కాలిపోతున్నాయి



గ్రామంలో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో వ్యవసాయ బోరు మోటర్లు తరుచుగా మరమ్మతులకు గురవుతున్నాయి. సాగుచేసిన పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. లోఓల్టేజీతో పంటలను కాపాడుకోలేకపోతున్నాం. ఏళ్లుగా సమస్యను తీర్చడం లేదు. సబ్‌స్టేషన్ మంజూరు అయినా రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.

– తగుళ్ల చంద్రయ్య, రైతు, పోతేపల్లి

ఆరేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



అసంపూర్తిగా ఉన్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి. బోరుబావులో, కేఎల్ఐ కాల్వలో నీరు పుష్కలంగా ఉన్న విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఆరేళ్లుగా లోఓల్టేజీ సమస్య కారణంగా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఇస్లావత్ నారాయణ, రైతు, అల్లంతోటబావితండా

త్వరలో పనులు పూర్తి చేస్తాం



సబ్‌స్టేషన్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం. కాంట్రాక్టర్లను సంప్రదించి పనులను వేగవంతంగా పూర్తిచేసి సబ్‌స్టేషన్ ప్రారంభిస్తాం. రైతులకు లోఓల్టేజీ సమస్యను ఉన్న మాట వాస్తవం. కేఎల్ఐ కాల్వ ద్వారా సాగునీరు రావడంతో విద్యుత్ మోటర్ల పెరగడంతో సమస్య ఎక్కువైంది. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

– సూర్యం, ఏఈ, వెల్దండ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్డులను అందిస్తున్న ఆంజనేయులు

కల్వకుర్తిరూరల్: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం కల్వకుర్తిలో తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన కార్మికుల కష్టాలు మారడం లేదన్నారు. నెలల తరబడి కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా కార్మికులకు జీతాలు రాకపోతే వారి కుటుంబ పోషణ ఎలా సాధ్యం అవుతుందని ఆయన ప్రశ్నించారు. కార్మికుల శ్రమను గుర్తించి రెండు జతల బట్టలు, సబ్బులు, మాస్కులు, చేతి గ్లౌస్‌లు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. అనంతరం కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ఐడెంటీకార్డులను అందజేశారు. కార్యక్రమంలో మహేష్, శంకర్, అర్జున్, లక్ష్మమ్మ, కృష్ణమ్మ, శ్రీనివాసులు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని లక్ష్మీనారాయణ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం గౌడ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఉద్యోగాలు సాధించిన గౌడ ఉద్యోగ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్, బద్దిని మధుసూదన్‌గౌడ్, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కల్పనాగౌడ్, శివయ్యగౌడ్, వేణుగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

మైనార్టీ సంఘం నూతన కమిటీ ఎన్నిక



అచ్చంపేట రూరల్: డివిజన్ స్థాయి మైనార్టీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఏ ఖదీర్, ఉపాధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌గౌస్, సెక్రటరీగా షేక్‌కరీం, సభ్యులుగా ఇసాయక్‌నాయక్, రఫీ, అహ్మద్‌భేగ్, ఖలీల్, బాబా, ఎన్నికయ్యారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారినిక దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గద్వాల, పెబ్బేరు, వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. 10 వేల మంది వరకు అమ్మవారిని దర్శించుకునట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పారదర్శకత పాటించాలి

కొల్లాపూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని బీఆర్ఎస్ నాయకుడు దేవని కుమార్‌మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఇందిరమ్మ కమిటీలో అన్ని రాజకీయ పార్టీల నాయకులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు.

క్షుద్రపూజల కలకలం

తెలకపల్లి: మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన చిలుకేశ్వరం పెద్ద తిరుపతయ్య పొలంలో క్షుద్రపూజలు కలకలం రేపింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం పెద్ద తిరుపతయ్య భూమిలో పత్తి సాగు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు తన పొలంలో క్షుద్రపూజలు చేశారని బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నల్లబెల్లం స్వాధీనం: కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాలో ఆదివారం సాయంత్రం పోలీసులు సోదాలు నిర్వహించారు. కాట్రావత్ శ్రీకాంత్ ఇంట్లో నిల్వచేసిన 120 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంత్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మేకలు చోరీ

వెల్దండ: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన బండ రాములుకు సంబంధించి 12 మేకలు ఆదివారం చోరీకి గురయ్యాయి. ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం రాములు రోజువారిగా శనివారం సాయంత్రం మేకలను తన ఇంటి సమీపంలోని షెడ్‌లో 16 మేకలను కట్టేవేసి నిద్రించాడు. ఉదయం లేచిచూసేసరికి 12 మేకలు కనిపించ లేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మేక విలువ రూ.60వేల వరకు ఉంటుందని తెలిపారు.

పూర్వ విద్యార్థి ఉదారత్వం



లింగాల: మండలంలోని జీల్గుపల్లితండా ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి దేవసత్ మల్లేష్ చేయూత అందించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి గేటు దిమ్మెలను, ర్యాంపు ఏర్పాటు చేయించి ఇనుప గేటును పెట్టించాడు. ఆయా పనులు పూర్తి కావడంతో ఆదివారం ప్రారంభించారు. తల్లిదండ్రులు నాగమ్మ, వెంకటయ్య జ్ఞాపకార్థం తాను చదువుకున్న పాఠశాలకు చేయూత అందించడం పట్ల తండా వాసులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కౌసల్య, రవి, రాంబాబు, శంకర్‌రాథోడ్, రూపేష్, ఆంజనేయులు, అంజి, లక్ష్మణ్, మమత తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు పరిసర ప్రాంతం జప్తీ సదగోడు నుంచి అచ్చంపేటకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ల యజమానులు నరేష్, శ్రీనులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా సహస్ర గాయత్రీ హోమం



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో నాగర్‌కర్నూల్ సహస్ర గాయత్రీ యజ్ఞ సమితి ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రీ మహాయజ్ఞం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివరాములు బేబీ దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. యజ్ఞకమిటీ అధ్యక్షుడు కటకం విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటిలో లేదా దేవాలయాల్లో సహస్ర యజ్ఞకమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మిడిదొడ్డి శివశంకర్, చంద్రశేఖర్, ఆకారపు మణికుమార్, శ్రీనివాసులు, గిరి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కారు బోల్తా: తప్పిన ప్రమాదం

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో హనుమాన్ దేవాలయం వద్ద స్తంభాన్ని ఢీకొట్టి కారు అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో ఉంటున్న హరిశంకర్‌రెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ జాతరకు బంధువుల ఇంటికొచ్చి కుమారుడితో తిరుగు ప్రయాణంలో హనుమాన్ దేవాలయం దగ్గర రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు అదుపు తప్పి సమీప పంట పొలాల్లో బోల్తాపడింది. అదృష్టవశాత్తు కారులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. రైతులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి వెంటనే విద్యుత్‌ను నిలుపుదల చేయించారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

అచ్చంపేట: రైతులు పడించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోందని రాష్ట్ర ఎపర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం అచ్చంపేట బీఆర్ అంబేడ్కర్ భవన్(క్యాంపు కార్యాలయం)లో అనూషా ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్, చైన్నై శంకర్ నేత్రాలయం సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని, నడింపల్లి గ్రామ శివారులోని వెంకటేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్‌లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్తికి గ్రేడ్–ఏ రకం 8 శాతం తేమ ఉంటే రూ. 7,521లు గ్రేడ్–2 రకానికి రూ. 7,220లు ప్రభుత్వం నిర్ణయించదన్నారు. వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లో 251 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ చెల్లిస్తోందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, గ్రంథాయల చైర్మన్ జి.రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటిశ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ రజిత మల్లేష్, అనుషా ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జలంధర్‌రెడ్డి, భాస్కర్, నర్సింహ, ఎ.గోపాల్‌రెడ్డి, సీఎంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు: రైతులకు అండగా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొండారెడ్డిపల్లి సమీపంలో ఉన్న లక్ష్మీవెంకటేశ్వర కాటన్‌మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్వింటాలు పత్తికి రూ.7,521 లు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని రైతులకు రూ.9.36 కోట్ల పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, కొండారెడ్డిపల్లి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎనుముల కృష్ణారెడ్డి, నాయకులు పండిత్‌రావు, పాండురంగారెడ్డి, వేమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లాలూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

మన్ననూర్: వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మన్ననూర్‌లోని అటవీశాఖ విశ్రాంతి గృహంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆలయ చరిత్రను కాపాడుకుంటామన్నారు. వారం రోజుల్లో ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా ఉమామహేశ్వర ఆలయం అభివృద్ధి పనుల కోసం రూ. 2.5 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినారాయణ, వెంకటరమణ, డాక్టర్ సురేష్, రవి, శ్రీనివాసులు, శివాజి గెలువయ్య, దుద్ద అనిల్, మాడుగుల నరేష్, రామావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాశీం

అమ్రాబాద్: ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశీం పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి వెంటనే వర్గీకరణ అమలు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా మందకృష్ణమాదిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్, బాల్‌సాయిలు, మల్లేష్, జైసింగ్, పవన్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

బల్మూర్: మండలంంలోని కొండనాగుల గ్రామానికి చెందిన శంకర్ వంగూరు మండలం కొండారెడ్డిపల్లి, గోదల్ గ్రామాలలో విద్యుత్ శాఖలో ఏఎల్ఎంగా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. తోటి మిత్రులు ఆదివారం ఐఎన్‌టీయూసీ 327 విద్యుత్ యూనియన్ ఆధ్వర్యంలో రూ. 1,06,720లు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. లాలయ్య, తిరుపతయ్య, శేఖర్‌గౌడ్, నీరంజన్, లక్ష్మయ్య, శ్రీధర్ చారి, వేణు పాల్గొన్నారు.

వెల్దండ: చెదురుపల్లి గ్రామానికి చెందిన కొమ్మగోని శివగౌడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినాడు. సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు బొక్కల లింగయ్య కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.5వేలు, ఆలూరి జంగయ్య కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం చేశారు. పోలె అలివేల కుటుంబాన్ని మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్ పరామర్శించి రూ.5వేలు ఇచ్చారు.

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ఓర్సు అంజమ్మ హైదరాబాద్ ఉస్మానియ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలికి అమెరికాలో ఉన్న గ్రామానికి చెందిన రంగినేని అనిల్ రావు రూ.10 వేలు పంపించడంతో నాయకులు కమలాకర్ రావు, కొండల్, కృష్ణ బాధితకుటుంబానికి నగదును అందించారు.

బ్రిడ్జికి పొంచి ఉన్న ప్రమాదం



పస్పుల శివారులో బ్రిడ్జిపై చేరిన సాగునీరు

కోడేరు: జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి కోడేరు, గుడిపల్లి, ఇతర మండలాలకు కేఎల్ఐ ప్రధాన కాల్వ ద్వారా అధికారులు సాగునీరు వదలడంతో పస్పుల శివారులో ఉన్న బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉంది. గతంలో ప్రధాన కాల్వలు తీసేటప్పుడు రైతులను దృష్టిలో ఉంచుకొని కేఎల్ఐ అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. అధికారులు సాగునీరు ఎక్కువగా వదలడంతో బ్రిడ్జిని ఆనుకొని సాగునీరు వెళ్తుంది. దీంతో కింది భాగంలో సిమెంట్ పెచ్చులూడి సీకులు తేలి బ్రిడ్జి పైభాగంలో నీరు చేరింది. దీంతో రైతులు రాకపోకలు సాగడం లేదు. అధికారులు స్పందించి సాగునీరు అధిక మోతాదులో వదిలేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

క్రీడాస్ఫూర్తిలో ఆదర్శంగా నిలవాలి



క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తున్న నాయకులు

వీపనగండ్ల: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకున్నప్పుడు ఇతర క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తారని బీజేపీ నియోజకవర్గ నాయకులు ధారసింగ్, బీఆర్ఎస్ నాయకులు ముంత మల్లయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు బీరయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గంగమ్మ జాతరను పురస్కరించుకొని నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు వారు బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీలో మొదటి బహుమతి సాతాపూర్‌కు రూ.15 వేలు, ద్వితీయ బహుమతి పుల్గర్‌చర్లకు రూ.10 వేలు, మూడో బహుమతి నాగర్‌కర్నూల్‌కు రూ.5 వేలు అందజేశారు. ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్‌లో కానాపూర్ జట్టుకు రూ.25 వేలు, పాన్‌గల్ జట్టుకు రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, శివయాదవ్, మీసాల రాము, నాగరాజు, అంబేద్కర్ యూత్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.